సాక్షి
వికారాబాద్
బుధవారం । 10 । జనవరి । 2024



పల్లెల్లో డ్రగ్స్ కల్చర్

పట్టణాలకే పరిమితమైన డ్రగ్స్ కల్చర్ పల్లెలకు విస్తరిస్తోంది. సాధారణ ప్రజలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. 8లో▸



వ్యాపారాభివృద్ధికి కృషి

నాపరాతి వ్యాపారాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



పకడ్బందీగా ఆన్‌లైన్

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలని మండల ప్రత్యేకాధికారి గోపాల్ పేర్కొన్నారు. 9లో▸

బియ్యం కుతకుత

రోజురోజుకూ పెరుగుతున్న ధరలు

- ధాన్యం – బియ్యం ధరల్లో తీవ్ర వ్యత్యాసం
- మిల్లర్ల మాయాజాలం
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆరుగాలం శ్రమించిన రైతులకు మొండిచేయి



వికారాబాద్: బియ్యం ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయి. ఓ పక్క ధాన్యం దిగుబడులు అంచనాకు మించి వస్తుంటే.. ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. వడ్లు.. బియ్యం ధరలకు ఎలాంటి పొంతన ఉండటం లేదు. రైస్ మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారుల మాయాజాలంతో ఇటు ధాన్యం పండించిన రైతులు, అటు బియ్యం కొనుగోలు చేసే వినియోగదారులకు నష్టం తప్పడం లేదు. ధరలు అదుపు చేయాల్సిన అధికారులు మిల్లర్లకే కొమ్ముకాస్తున్నారు. ఆరుగాలం శ్రమించిన రైతుల నుంచి మిల్లర్లు కొనుగోలు చేసే వడ్ల ధరలకు తరువాత బియ్యంగా మార్చి వినియోగదారునికి విక్రయించే బియ్యం ధరలకు పొంతన ఉండడం లేదు. ఈ రెండింటి ధరల్లో తీవ్ర వ్యత్యాసం ఉంటోంది. క్వింటాలు వడ్లకు రూ.1,800 నుంచి రూ. 2,000 వస్తే వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు వంద రూపాయల ఖర్చుతో బియ్యంగా మార్చి వారం రోజుల్లో వేలకు వేలు లాభాలు పొందుతున్నారు. అయితే ధాన్యం సీజన్ ఇటీవలే ముగియగా ఇప్పుడే బియ్యం ధరలు మండిపోతున్నాయి. అధికారులు స్పందించి బియ్యం ధరలను అదుపుచేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

తీవ్ర వ్యత్యాసం

మిల్లర్లు రైతు నుంచి పొలాల వద్ద లేక వ్యవసాయ మార్కెట్లలో క్వింటాలు వడ్లను రూ.1,600 నుంచి రూ.1,800లకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఐదు కిలోల తరుగుతో రూ. 2,100 నుంచి రూ. 2,200లకు కొనుగోలు చేస్తున్నారు. అయితే బ్రాండ్ల పేరుతో క్వింటాలు బియ్యం రూ. 6వేల నుంచి రూ. 6,500 వరకు విక్రయిస్తున్నారు. ఏ బ్రాండు వడ్లు కూడా రూ. 2,200 దాటిన పాపాన పోలేదు. క్వింటాలు వడ్లను బియ్యంగా మారిస్తే 65కిలోల బియ్యం వస్తాయి. తవుడు, నూకలు అదనం. క్వింటాలు వడ్లను బియ్యంగా మార్చేందుకు రూ.100 వరకు ఖర్చు వస్తుంది. అయితే తవుడు విక్రయించడం ద్వారా రూ.100 వస్తుంది. అంటే మిల్లర్లు వడ్లను బియ్యంగా మార్చేందుకు వెచ్చించే ఖర్చు శూన్యమే.. బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ. 60కి విక్రస్తున్నారు. ఈ లెక్కన 65కిలోల బియ్యానికి రూ.3,900 వస్తాయి. అంటే ఏ ఖర్చు చేయకుండా మిల్లర్లు.. వ్యాపారులు వారి మాయాజాలంతో క్వింటాలుకు రూ.1,600 నుంచి రూ.1,700 వరకు లాభం పొందుతున్నారు. అదే బియ్యం ఓ రెండు మూడు నెలలు నిల్వ చేసి పాత బియ్యమంటూ మరింత ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు.

మిల్లర్ల మాయాజాలం

రైస్ మిల్లర్లు చేస్తున్న అవకతవకలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మిల్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయగలిగితే అటు రైతుకు మంచి ధర లభించడం తోపాటు వినియోగదారునికి సైతం తక్కువ ధరకు బియ్యం లభించే అవకాశం ఉంది. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. వారిచ్చే మామూళ్లు తీసుకుంటూ వారికే కొమ్ము కాస్తున్నారు. దీంతో మిల్లర్లు రూ.4,వేలకే ఇవాల్సిన క్వింటాలు బియ్యాన్ని రూ.6వేల నుంచి రూ. 6,500 వరకు విక్రయిస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టిస్తూ వివిధ బ్రాండ్ల పేరుతో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇష్టారాజ్యంగా బియ్యం నిల్వ చేస్తూ పండించిన రైతుల కంటే రెండింతల లాభాలు పొందుతున్నారు. మరోవైపు రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేసే అడ్డాలుగా రైస్ మిల్లులు మారుతున్నాయి.



తాండూరు మున్సిపల్ కార్యాలయం

పదవీ గండం

- మరోసారి తెరపైకి అవిశ్వాసం
- మున్సిపల్ చైర్‌పర్సన్‌ను గద్దె దింపేందుకు సిద్ధమవుతున్న సొంతపార్టీ కౌన్సిలర్లు



స్వప్నపరిమళ్, చైర్‌పర్సన్

తాండూరు: తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ సప్నపరిమళ్ సీటుకు మరోసారి గండం వచ్చి పడుతోంది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లే రెడీ అవుతున్నారు. గతేడాది స్వప్నపరిమళ్‌పై అవిశ్వాసం ప్రవేశ పెట్టాలంటూ కలెక్టర్‌కు నోటీసు ఇచ్చారు. కానీ అప్పట్లో అది వాయిదా పడింది. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో సఖ్యతగా ఉన్న చైర్‌పర్సన్ సప్న ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రోహిత్‌రెడ్డి ఓటమి కోసం పని చేశారని ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. చైర్‌పర్సన్ పట్నం వర్గం కావడంతో పదవీ గండం తప్పదనే ప్రచారం జరుగుతోంది. మరోసారి వైస్ చైర్‌పర్సన్ దీప చైర్‌పర్సన్ రేసులో ఉంటారా..? మరొకరికి అవకాశం కల్పిస్తారా? అనే చర్చ జరుగుతోంది. ఆరు నెలల క్రితం వరకు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సఖ్యతగా కొనసాగారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో వైస్ చైర్‌పర్సన్ దీప మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి చైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు. ఎన్నికల సమయంలో చైర్‌పర్సన్ మార్పు సరి కాదని కేటీఆర్ స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. దీంతో వైస్ చైర్‌పర్సన్ దీప నాటి నుంచి మున్సిపల్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులు రోహిత్‌రెడ్డి గెలుపునకు పని చేయలేదని ఆయన వర్గీయులు బలంగా నమ్ముతున్నారు. ఇదే విషయాన్ని రోహిత్‌రెడ్డి సైతం పలుసార్లు బహిరంగంగా విమర్శించారు. పైలెట్ ఓటమికి కారణమైన పట్నం వర్గీయులకు భవిష్యత్తులో పార్టీ పదవులు, స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వరాదని పైలెట్ వర్గం పట్టుబడుతోంది. ఇందులో భాగంగానే మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. మున్సిపల్ పాలకవర్గం గడువు మరో ఏడాది మిగిలి ఉంది. దీంతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లు మద్దతు కూడగట్టుకున్నారు. రెండు మూడు రోజుల్లో అవిశ్వాసం పెట్టేందుకు కౌన్సిలర్లు అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కృష్ణంరాజు



రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న కృష్ణంరాజు

కొడంగల్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు మంగళవారం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్‌కు చెందిన కృష్ణంరాజు సీఎంను కలవడంపై యువజన కాంగ్రెస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

రేపు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

వికారాబాద్ అర్బన్: ప్రధాన మంత్రి జనతి ఆదివాసి న్యాయ మహా అభియాన్‌లో భాగంగా జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మొబైల్ మెడికల్ యూనిట్‌లో పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య శాఖ అధికారి పాల్వాన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న అర్హత గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వైద్యాధికారి పోస్టు భర్తీ కోసం రోస్టర్ ప్రకారం ఎస్సీ మహిళా అభ్యర్థులు అర్హులు. స్టాఫ్ నర్సు, జీఏన్ఎం 1, రోస్టర్ ప్రకారం ఎస్సీ అభ్యర్థులు అర్హులు, లాబ్ టెక్నీషియన్ 1 రోస్టర్ ప్రకారం ఓపెన్ కేటగిరీలో మహిళా అభ్యర్థులు అర్హులు, పారామెడికల్ అసిస్టెంట్ 1, మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఈ పోస్టులకు అవసరమైన విద్యా అర్హతలు ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలను vikarabad.tea nfana.gov.in. నందు పొందవచ్చునని తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

మాజీ ఎమ్మెల్యే ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ ఓటమికి ఎవరూ కుంగిపోరాదని, మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. రాను న్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అ నంతరం కుదుగుంట గ్రామానికి వెళ్లి గాయపడిన బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త ప్రవీణ్‌కుమార్‌ను పరామర్శించారు.కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మధుకర్, ఎంపీటీసీ రవి, మాజీ వైస్ ఎంపీపీ అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



సంఘం సభ్యులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాద్‌కుమార్

బంట్వారం: తమ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలపై తగు చర్యలు తీసుకుంటుందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని ఆయన నివాసంలో టీయూటీఎఫ్ బంట్వారం మండల శాఖ ముద్రించిన 2024 క్యాలెండర్‌ను ఆ సంఘం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తామన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు బీ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, ప్రతినిధులు ప్రసాద్, బందెయ్య, దీపక్ రాథోడ్, అనిల్, ప్రకాష్, శ్రీనివాస్, శేఖర్, అంజయ్య, గంగాధర్‌రావు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్రత్యేక పాలనే..!

- పంచాయతీ ఎన్నికలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఈనెల 31తో ముగియనున్న పాలకవర్గాల గడువు



పంచాయతీ కార్యాలయ భవనం

తాండూరు: గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు మరో 25 రోజుల్లో ముగియనుంది. జీపీలకు ఎన్నికలు జరుగుతాయా, వాయిదా పడతాయా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహిస్తుందా? ఏమైనా మార్పులు చేస్తుందా అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు బిజీగా ఉన్నారు. దీంతో ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలు లేవంటూ ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరి నెల నుంచి పంచాయతీలకు ప్రత్యేక పాలన తప్పడం లేదు. 2019లో పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అయితే పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించిన అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలైన జీపీలు, జిల్లా, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీలకు కేటాయించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగించేలా చట్టాన్ని రూపొందించింది. 2018 మార్చి 30న ప్రభుత్వం చట్టాన్ని సవరించి ఉత్తర్వులు జారీ చేసింది. 2019లో ఎన్నికైన సర్పంచుల పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల సంఘం గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం కసరత్తు చేసింది. తర్వాత ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఏర్పాట్లను నిలిపి వేశారు. జిల్లాలో 20 మండలాలు, 565 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుతం జీపీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. గ్రామ పంచాయతీలకు సర్పంచుల స్థానంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం ఉందని అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పాలక వర్గం గడువు మరో 25 రోజుల్లో ముగియనుంది. అప్పటిలోగా ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదు. కోడ్ వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేయడం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్యారంటీలు అమలు చేశాకే వరుస ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

ఎలాంటి ఆదేశాలు అందలేదు

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రస్తుతం ప్రజాపాలన కార్యక్రమంతో బిజీగా ఉన్నాం. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 31తో ముగుస్తుంది. 20 రోజుల్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదు.

– తరుణ్‌భాస్కర్, డీపీఓ

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలి

- సంస్థ డిప్యూటీ ఆర్‌ఎం సుచరిత

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఉద్యోగులంతా కష్టపడి పని చేస్తున్నారని.. అదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆ సంస్థ డిప్యూటీ ఆర్‌ఎం సుచరిత అన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఉద్యోగులకు మంగళవారం వనభోజనాల కార్యక్రమాన్ని డిపో ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి ఉద్యోగుల సహకారం ఎంతో అవసరమన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచనల మేరకు ఉద్యోగుల్లో చైతన్యం కల్పించి, వారిలో నూతనోత్సాహం నింపేందుకు వనభోజనాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం డీఎం వెంకట్‌నర్సప్ప, హయత్‌నగర్ 1,2 డిపో మేనేజర్లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ వెంకటనర్సప్ప, మెకానికల్ ఇంజినీర్ సత్తయ్య, కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది హాజరయ్యారు.



ఆర్టీసీ మహిళా ఉద్యోగులతో ఆటపాటల్లో డిప్యూటీ ఆర్‌ఎం సుచరిత

అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: జిల్లా అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ సీ నారాయణ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల నివేదికను సమర్పించాలని, పాలనాపరమైన పనులు మంజూరైన వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనులు ఏవైనా ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. స్థానిక అవసరాల నిమిత్తం భూసేకరణ చేపట్టాలన్నారు. అంతర్జాతీయ పాఠశాలలు మంజూరు అవుతున్న నేపథ్యంలో మండల కేంద్రాల్లో 10 ఎకరాల భూమిని సిద్ధం చేసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు 10 ఎకరాలకు తక్కువ కాకుండా భూములు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ధరణి పెండింగ్ పనులను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వే పనుల కోసం జాప్యం లేకుండా స్థల సేకరణ చేయాలన్నారు. వారం రోజుల్లో ఇందుకు సంబంధించిన వివరాలు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల వివరాలు తెలియజేయాలని అన్నారు. సౌకర్యాలు, వసతులు లేక ఆయా ప్రాంతాలకు మంజూరైన గురుకుల పాఠశాలలు, కళాశాలలు వేరే ప్రాంతాల్లో ఏర్పాటు చేశారని, వాటిని వారం రోజుల్లో సంబంధిత నియోజకవర్గంలోఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే భవన నిర్మాణానికి భూముల కేటాయించాలని సూచించారు. మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల జాబితాను సిద్ధం చేయాలని డీఈఓకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

సీఎంకు ఎస్‌జీటీయూ నేతల వినతి

తలకొండపల్లి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేస్తూ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్‌జీటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పండుగ అంజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఎస్‌జీటీయూ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. సంఖ్యతో, విద్యార్థుల నమోదుతో సంబంధం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ప్రతీ పంచాయతీ పరిధిలో ఒక ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేసి, ప్రతి తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు, ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాలన్నారు. పాఠశాలల పరిశుభ్రతకు సర్వీస్ పర్సన్స్‌ను నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలన్నారు. సబ్జెక్టు కొరత ఉన్న పాఠశాలల్లో విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. పది వేల పీఎస్ హెచ్ఎం పోస్టుల మంజూరుకు ఉత్తర్వులిచ్చి పదోన్నతులు, బదిలీలు చేపట్టి కొత్త నియమకాలు చేపట్టాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థకు పెద్దపీట వేయాలి



ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యా వ్యవస్థకు కొత్త ప్రభుత్వం పెద్దపీట వేయాలని జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠ్ లో మంగళవారం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎస్‌రెడ్డి, డీఈఓ సుశీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థుల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులు ఉండాలన్నారు. విద్యార్థుల ఆలోచలనకు మెరుగుపెట్టి వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో తోడ్పడతాయన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. సమాజ వికాసానికి విద్యే మూలమన్నారు. రాష్ట్రంలోని 50 శాతం మంది విద్యార్థులకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలే దిక్సూచిగా ఉండటం సంతోషకరమన్నారు. ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి ఆధునిక సాంకేతికత ఒక్కరోజులో పుట్టలేదని, ఎన్నో సంవత్సరాల నిరంతర అలోచన, తపన, నిర్విరామ కృషి తోనే సాధ్యమైందన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యదశ నుంచే విశ్లేషణాత్మక ఆలోచనలను అలవర్చుకోవాలన్నారు. ఈ ప్రదర్శనలో గణిత, వైజ్ఞానిక, పర్యావరణానికి సంబంధించి 312 ప్రాజెక్టులు ప్రదర్శించారు. వేదికపై నుంచి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పిన శ్రీనిధి అనే విద్యార్థిని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పిలిచి ప్రోత్సాహకంగా షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ సభ్యుడు భూపతిగాళ్ల మహిపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, డీఈఓ సుశీందర్‌రావు, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్‌రావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్‌రావు, డీసీఈబీ కార్యదర్శి రాంచంద్రారెడ్డి, మండల విద్యాధికారులు వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కొడంగల్: వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా చేయనున్నట్లు దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత బంధుకు ఎంపికై న లబ్ధిదారులకు గ్రౌండింగ్ చేయాలని కోరారు. దళితుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ పథకాన్ని పట్టించుకోవడం లేదని తెలిపారు. జిల్లాలోని లబ్ధిదారులు బుధవారం ఉదయం కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాకు హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

టీఎస్‌యూటీఎఫ్
జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం



సభ్యత్వ నమోదులో వెంకటరత్నం తదితరులు

బంట్వారం: ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం భావిస్తున్న కొత్త జిల్లాల ఏర్పాటు శాస్త్రీయంగా ఉండాలని విన్నవించారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానికత ఆధారంగా తిరిగి కేటాయించాలన్నారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన జిల్లాలతో అనేక మంది ఉపాధ్యాయులు స్థానికత కోల్పోయి కుటుంబాలకు దూరమై తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ మండల అధ్యక్షుడు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు పదోన్నతులు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లకు పదోన్నతులు లభించినట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన 25 మందిని వివిధ స్టేషన్లకు బదిలీ చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వారితో మాట్లాడారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏఓ జ్యోతిర్మని, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, జిల్లా పోలీసు ప్రెసిడెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీ కొట్టిన లారీ

వ్యక్తికి తీవ్ర గాయాలు

తాండూరు టౌన్: లారీ బైకును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని హమాలీ బస్తీకి చెందిన కూలీ శేఖర్ తన బైకుపై ఇంటి నుంచి బయలుదేరి లారీ పార్కింగ్ వద్దకు రాగానే, హైదరాబాద్ రోడ్డు నుంచి ఇందిరాచౌక్ వైపునకు వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అతడి ఎడమ కాలు, ఎడమ చేయి విరిగిపోగా, తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బైక్ చోరీ.. కేసు నమోదు

తలకొండపల్లి: ఎనిమిది నెలల క్రితం బైక్ చోరీకి గురైన విషయంలో మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీను తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని తాళ్లగుట్టతండాకు చెందిన గోపాల్ పెద్దూరు తండాలో ఎనిమిది నెలల క్రితం మేస్త్రీ పని చేస్తున్నాడు. వారు పనిచేసే ప్రదేశంలో బైక్ గుర్తు తెలియని వ్యక్తులు బైక్ ఎత్తుకెళ్లారు. బైక్ ఈఎంఐ కట్టకపోవడంతో ఇటీవల ఫైనాన్స్ కంపెనీవారు నోటీసులు ఇచ్చారు. దీంతో గోపాల్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

పల్లెల్లో డ్రగ్స్ కల్చర్

బానిసలవుతున్న యువత
- విచ్చలవిడిగా గంజాయి విక్రయం
- అడ్డుకట్టవేయకుంటే అనర్థమే

గంజాయి మత్తు పల్లెలను చుట్టుముడుతోంది. తక్కువ ధరకు ఎక్కువ మత్తునిస్తుండడంతో యువత దానికి బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.



పరిగి: పట్టణాలకు మాత్రమే పరిమితమైన డ్రగ్స్ కల్చర్ మెల్లమెల్లగా పల్లెలకు విస్తరిస్తోంది. సెలబ్రిటీల నుంచి సాధారణ ప్రజల వరకు మత్తు పదార్థాలకు బానిసలుగా అవుతున్నారు. గంజాయి సాగుచేసిన లేదా విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించినా.. గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నారు. దీనికి ఎక్కువగా విద్యార్థులే బానిసలవ్వడం ఆందోళన కలిగించే విషయం. సరదా కోసం అలవాటు చేసుకుంటున్న మత్తు క్రమంగా జీవితాన్నే హరించే విధంగా మారుతోంది. అధికారుల కళ్లుగప్పి మరీ యువత గంజాయి మత్తులో ఊగుతున్నారు. గంజాయి కొనుగోలు ఇంట్లో నుంచి డబ్బులను దొంగలిస్తున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. గంజాయితీ సేవించే యువత ఒక గ్రూప్‌గా ఏర్పడి ఎక్కడ, ఎవరి దగ్గర గంజాయి లభిస్తుందో సమాచారాన్ని చేరవేసుకుంటున్నారు. తాత్కాలిక ఆనందం కోసం నూరేళ్ల జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. గంజాయి విక్రయదారులు సైతం అధికారుల కంట పడకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. కొత్తవారికి కాకుండా రెగ్యులర్ కస్టమర్లకే విక్రయిస్తూ మూడో కంట పడకుండా గుట్టుగా దందా సాగిస్తున్నారు. మత్తులో గొడవలు పడటం, ద్విచక్రవాహనాలను వేగంగా నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో, కళాశాలల్లో మత్తు పదార్థాన్ని నిర్మూలించేందుకు సెమినార్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

పట్టణంలోని రెండు, మూడు కాలనీలల్లోని యువత ఎక్కువగా డ్రగ్స్ సేవిస్తున్నట్లు సమాచారం. వీరులో మైనర్లే ఎక్కువగా ఉండడం ఆందోళన చెందిందే విషయం. గతంలోనూ పట్టణంలో గంజాయి సేవిస్తూ పోలీసులకు పట్టుబడ్డ వారు మైనర్లే ఉన్నారు. పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేశారు. పట్టణంలో ఉన్న యువత ఎక్కువగా టీచర్స్ కాలనీ చివరన, ఫైర్‌స్టేషన్ కిష్టమ్మగడ్డతండా సమీపంలో, నస్కల్ వాగు సమీపాల్లో రాత్రి వేళ ఖాళీ వెంచర్లల్లో గంజాయిని సేవిస్తున్నారు. ఇటీవలనే గంజాయిని సాగుచేస్తున్న పలువురిపై కేసులు నమోదు చేశారు.

నగరం నుంచి పట్టణానికి

పట్టణంలోని పలువురు బడా బాబులు, ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఎక్కువగా మత్తుకు బానిసలుగా అవుతున్నారు. వేల రూపాయాలు వెచ్చించి కొనుగోలు పేదలకు సాధ్యంకాకపోవడంతో కొందరు బడాబాబుల సంతానం గొప్పకు పోయి బానిసలవుతున్నారు. దాదాపు వంద మంది పిల్లలు నిత్యం డ్రగ్స్‌ను సేవిస్తున్నట్లు వినికిడి. పరిగి పరిసర ప్రాంతాల గ్రామాల్లోనూ గంజాయి సాగుచేస్తున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.

> **విక్రయించినా, సాగు చేసినా చర్యలు**
>
> 
>
> గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. గ్రామాల్లో పంట పొలాలో సాగుచేస్తున్న వారిపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. నగరం నుంచి పట్టణానికి సరఫరా చేస్తున్న ముఠాపై స్పెషల్ నిఘా ఉంచాం. గంజాయి విక్రయించినా, సాగు చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. – చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ, పరిగి

నాపరాతి వ్యాపారాభివృద్ధికి కృషి



తాండూరు రూరల్: ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న క్వారీ,స్టోన్ అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు/తాండూరు రూరల్: నాపరాతి వ్యాపారాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహ ర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి తాండూరు మండల క్వారీ అసోసియేషన్, స్టోన్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలోనే తాండూరు నాపరాతికి మంచి ఆదరణ ఉందన్నారు. పట్టణంలో కాలుష్య నివారణకు జినుగుర్తి గేటు వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కరెంట్ చార్జీలు తగ్గించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్వారీ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ప్రధాన కార్యదర్శి జుబేర్ లాల, ట్రెజరీ జైనుద్దీన్, స్టోన్ అసోసియేషన్ అధ్యక్షుడు నయీం(అప్పు), ప్రధాన కార్యదర్శి ఫయాజ్, ట్రెజరీ సంజీవ్‌కుమార్ పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

సున్నిత అవయవాలపై దాడి.. కూలీ మృతి



వీరారెడ్డి (ఫైల్)

తాండూరు టౌన్: మర్మాంగాలు, ముఖంపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో ఓ కూలీ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి తాండూరు టౌన్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపిన ప్రకారం.. ధారూరు మండలం నాగారం గ్రామానికి చెందిన జె.వీరారెడ్డి(43) భార్య మృతి చెందడంతో తాండూరులోని కుమ్మరి గల్లీలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఫయాజ్ పెట్రోల్ పంప్ ఎదుట ఉన్న దుకాణం వద్ద వ్యక్తి మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్, రూరల్ సీఐ రాంబాబు, పట్టణ ఎస్ఐ రవూఫ్ ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడి ముఖం, మర్మాంగాలపై కాలితో తన్ని హత్య చేసి ఉంటారన్నారు. మృతుడి తండ్రి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న డీఎస్పీ శేఖర్ గౌడ్, ఎస్ఐ రవూఫ్

బియ్యం సరఫరాలో అక్రమాలు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎరన్‌పల్లి గ్రామస్తులు

ఎరన్‌పల్లి రేషన్ డీలర్‌పై గ్రామస్తుల ఫిర్యాదు

కొడంగల్: ఎరన్‌పల్లి డీలర్ కిషన్‌సింగ్ బియ్యం సరఫరాలో అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన గ్రామస్తులు డీలర్ బియ్యం సరఫరాలో అక్రమాలకు పాల్పడుతున్నాడని గతంలోనూ ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామానికి సంబంధించి ఆయన దగ్గర ఎన్ని కార్డులున్నాయి.. ఎన్ని రకాల కార్డులున్నాయి.. ఎంత మొత్తం కోటా వస్తుందని సమాచార హక్కు చట్టం కింద వివరాలు ఇవ్వాలని కోరారు. 2023 ఏడాదికి సంబంధించిన వివరాలు ప్రతీ నెల వివరాలు గ్రామస్తులకు ఇవ్వాలని తహసీల్దార్‌ను కోరారు.

గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ రాంచందర్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రం జితేంద్రకుమార్‌వర్మ(46), ధర్మేందర్ తివారి గత కొంత కాలంగా ఎలికట్టలో అద్దె గదిలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇద్దరు చికెన్ వండుకొని పూరీలు చేసుకొని మద్యం తాగుతూ భోజనం చేస్తుండగా జితేంద్రకుమార్ ఒక్కసారిగా కింద పడిపోయాడు. పక్కన వారు వచ్చి చూసే సరికి అతడు చనిపోయాడు. విషయాన్ని తెలుసుకున్న ఏఎస్ఐ రాంచందర్ క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని చనిపోయినట్లుగా నిర్ధారించారు. ధర్మేందర్ తివారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బెదిరించి నగదు, నగలు చోరీ

మంచాల: నమ్మి ఆటో ఎక్కిన ఓ వృద్ధురాలిని నిర్మానుష ప్రాంతంలోకి తీసుకెళ్లి బెదిరించి నగదు, ఆభరణాలు చోరీకి పాల్పడిన సంఘటన మంచాల పోలీసుస్టేషన్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా లింగంపేట మండలం సంగారెడ్డిపేట గ్రామానికి చెందిన కొవ్వూరు లక్ష్మి(74) రెండు నెలల నుంచి మీర్‌పేట్‌లో చిన్న కూతురు వద్ద నివాసం ఉంటున్నారు. పెన్షన్ డబ్బులు అవసరం నిమిత్తం మూడు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లారు. తిరిగి ఆదివారం సంగారెడ్డిలో బస్సు ఎక్కి హైదరాబాద్‌కు బయలు దేరారు. ఎంజీబీఎస్ బస్సు స్టాఫ్ దగ్గర ఆటోలో ఎక్కారు. ఆటో డ్రైవర్ రంగాపూర్–జాపాల మధ్య అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి నగదు కోసం బెదిరించాడు. రెండు తులాల బంగారు పుస్తెల తాడు, రూ.5 వేల నగదు, ఫోను లాక్కొని వృద్ధురాలికి వదిలేసి వెళ్లి పోయాడు. భయంతో మంచాల పోలీసులను ఆమె ఆశ్రయించారు. వెంటనే కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను సింగరేణి కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు తెలిసింది. విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

వీడని మిస్టరీ!

- మహిళ హత్య కేసులో నిందితుల కోసం గాలింపు
- పర్యవేక్షిస్తున్న చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

మొయినాబాద్: గుర్తు తెలియని మహిళను హత్య చేసిన ఉదంతం మిస్టరీగా మారింది. ఘటన జరిగి 24 గంటలు దాటినా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు. మృతురాలి వివరాలు తెలియక పోగా హత్యచేసి మృతదేహాన్ని తగలబెట్టిన నిందితులు సైతం దొరకలేదు. వివరాలు తెలుసుకోవడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు పోలీసు బృందాలు నిర్విరామంగా పని చేస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని మహిళ(25)ను నిందితులు ఎక్కడో హత్య చేసి మొయినాబాద్ మండల పరిధిలోని బాకారం శివారుల్లో రోడ్డు పక్కన తగలబెట్టిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై పోలీసులు స్పందించి నిందితుల కోసం మూడు బృందాలుగా ఏర్పడి రంగంలోకి దిగారు. మంగళవారం ఘటన జరిగిన ప్రదేశానికి దగ్గరలో ఉన్న ఫాంహౌస్‌లు, రిసార్ట్స్‌లు, వ్యవసాయ క్షేత్రాలను పోలీసులు పరిశీలించారు. వాటిల్లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా ఘటన జరిగిన తీరుపై ఆరాతీశారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం సేకరించిన నమూనాలను, సగం కాలిన సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచి నివేదికలు రావాల్సి ఉంది.

తెలియని మృతురాలి వివరాలు..

హత్యకు గురైన మహిళ వివరాలు ఇంకా తెలియలేదు. మృతురాలి వివరాల కోసం పోలీసులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. ఎక్కడైనా 25 ఏళ్ల మహిళలు, యువతులకు సంబంధించిన మిస్సింగ్ కేసులు నమోదయ్యాయా అనే వివరాలు తెలుసుకుంటున్నారు. చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఈ కేసును ఛేదించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు తీవ్రం చేశారు. అదే విధంగా మృతురాలి వివరాలు తెలుసుకోవడంపైనా దృష్టి పెట్టారు.

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు బాగు



సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉషారాణి

- రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- అవగాహన సదస్సులో ఉద్యాన అధికారి ఉషారాణి

కొందుర్గు: తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని షాద్ నగర్ ఉద్యాన అధికారిణి ఉషారాణి సూచించారు. మంగళవారం కొందుర్గు రైతువేదికలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని, రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఐదు ఎకరాల లోపు ఓసీ, బీసీ రైతులకు 90 శాతం, 5 ఎకరాల పైన ఉన్న రైతులకు 80 శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం అందిస్తామన్నారు. ఆయిల్ పామ్ పంట మూడేళ్ల అనంతరం చేతికొస్తుందని, అంతవరకు అంతర పంటలు సాగు చేసుకోవచ్చని వివరించారు. పంట దిగుబడి వచ్చే వరకు వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ద్వారా నియమించబడిన ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. పంట చేతికొచ్చిన అనంతరం మార్కెటింగ్ సదుపాయం ఉంటుందని అన్నారు. ఈ ఏడాది రంగారెడ్డి జిల్లాలో 5,500 ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుందని ఇందులో భాగంగా షాద్‌నగర్ డివిజన్‌లో 1,500 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంటను సాగు చేయడానికి నిర్దేశించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీశైలం, వాసవి, లక్ష్మీకాంత్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ మల్లారెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

గాయపడిన రైతు



ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో బోల్తాపడిన ట్రాక్టర్

మొయినాబాద్: ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను వెనకనుంచి ఢీకొట్టడంతో ట్రాక్టర్ బోల్తాపడి ఓ రైతు గాయపడ్డాడు. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం... మండల పరిధిలోని తోలుకట్ట గ్రామానికి చెందిన రైతు కుమ్మరి సత్తయ్య వడ్ల బస్తాలను ట్రాక్టర్ ట్రాలీలో వేసుకుని సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మొయినాబాద్‌లోని రైస్‌మిల్‌కు వెళ్తున్నాడు. మండల కేంద్రం సమీపంలోని తాజ్ హోటల్ వద్దకు రాగానే పరిగి నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంతో వచ్చి వెనక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ చాకలి శ్రీశైలం, రైతు కుమ్మరి సత్తయ్య ట్రాక్టర్ పైనుంచి ఎగిరి పడ్డారు. రైతు సత్తయ్యకు గాయాలయ్యాయి. వడ్ల బస్తాలు కింద పడిపోయాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు, పోలీసులకు సమాచారం అందించారు. 108 సమయానికి రాకపోవడంతో ప్రైవేటు అంబులెన్స్‌లో గాయాలైన రైతును ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు

- సైంటిస్టు డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్
- కోరింతకుంట తండాలో రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సైంటిస్టు వినోద్‌కుమార్ యాదవ్

తలకొండపల్లి: వ్యవసాయానికి అనుబంధంగా పట్టు పురుగుల పెంపకం చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని సైంటిస్టు డాక్టర్ వినోద్‌కుమార్ యాదవ్ సూచించారు. నిత్యం పని చేసే చిన్న సన్నకారు రైతులకు పట్టు పురుగుల పెంపకం ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడితో ఏడాది అంతా పంటను తీసుకోవచ్చన్నారు. ప్రతి నెలా ఆదాయాన్ని ఆర్జించవచ్చన్నారు. మండల పరిధిలోని కోరింతకుంట తండాలో, సెంట్రల్ సిల్క్‌బోర్డు, రీజినల్ సెరికల్చర్ రిసర్చ్ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతు దినోత్సవ సందర్భంగా పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల సాగుపై పట్టు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వినోద్‌తో పాటు, అసిస్టెంట్ సైంటిస్టు డాక్టర్ రాఘవేందర్, సీనియర్ టెక్నికల్ అధికారి తుయమనిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పట్టు పురుగులకు నాణ్యమైన మల్బరీ ఆకులను మేతగా వేస్తే దిగుబడి అధికంగా వస్తుందన్నారు. పట్టు సాగులో రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం మల్బరీ తోటలను సాగు చేసే రైతాంగానికి అనేక రాయితీలు, ప్రోత్సాహకాలను అందజేస్తుందన్నారు. మల్బరీ పెంపకం నుంచి షెడ్డు నిర్మాణం వరకు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశ పెట్టినట్లు గుర్తు చేశారు. అనంతరం పట్టు పురుగుల పెంపకం, మెళకువలు, మల్బరీ తోటల సాగు విధానంపై చర్చించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీహెచ్ఎస్ఓ నీరజగాంధీ, హార్టికల్చర్, సెరికల్చర్‌ల అసిస్టెంట్ డైరెక్టర్లు సంజయ్ కుమార్, ముత్యాలు, పట్టు రైతుల జిల్లా నాయకులు సయ్యద్ రఫీక్, సయ్యద్ సాధిక్, శుక్రునాయక్, భూషన్, ప్రశాంత్‌రెడ్డి, మల్లేశ్, రవీందర్, దేవిలాల్, స్వాతిరెడ్డి, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి

- ప్రతి సమావేశానికి అధికారులు హాజరు కావాల్సిందే
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రాజకీయాలను పక్కనపెట్టి అందరూ అభివృద్ధి బాట పట్టాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. హయత్‌నగర్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికి పథకాలతో మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల సమయం ముగిసినందున అందరూ రాజకీయాలను పక్కన పెట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమన్నారు.

అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి

మండల పరిషత్ పరిధిలో నిర్వహించే సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరవ్వాల్సిందేనని ఎమ్మెల్యే రంగారెడ్డి ఆదేశాలు జారీచేశారు. ఇప్పటి వరకు జరిగిన సమావేశాలకు అధికారులు హాజరు కాకపోయినా ఏమీ కాలేదు అనే నిర్లక్ష్యాన్ని వీడాలన్నారు. ఏ సమావేశం నిర్వహించినా ప్రతి శాఖకు సంబంధించిన అధికారి మండలానికి సంబంధించిన వివరాలతో హాజరు కావాలన్నారు.

మండల పరిషత్ కార్యాలయ ఏర్పాటుకు..

మండలాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో అధునాతనమైన మండల పరిషత్ కార్యాలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే రంగారెడ్డి హామీ ఇచ్చారు. గతంలో హయత్‌నగర్‌లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిర్మించిన మండల పరిషత్ భవనం ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేఖామహేందర్‌గౌడ్, జడ్పీటీసీ దాసుగౌడ్, వైస్‌ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఎంపీడీఓ మీరాబాయి, వైస్‌చైర్ పర్సన్ సంపూర్ణవిజయశేఖర్‌రెడ్డి, సర్పంచులు వెంకటేశ్, మహేశ్‌గౌడ్, లతాశ్రీ,సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లేశ్, రంగయ్య ఎంపీటీసీలు వెంకటేశ్, గ్యార బాలలింగస్వామి, బాలమణి, మహ్మద్‌గౌస్‌పాషా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.